


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"రేపొచ్చి కలుస్తారా?"

"సాయంత్రం వస్తాను. చాలారోజులయిందిగా మీ ఇంటికొచ్చి. అన్నట్టు రేపు, ఎల్లుండి నడకకు రాను. పొద్దున్నే ఒకచోటికి వెళ్ళలిసిన పనుంది."

అలా నడకను ఎగకొట్టటానికి ముఖ్యమైన కారణం ఉంది. కృపారావు ఆరోజున వచ్చి రాయుడు లేకుండా అతని భార్య నడవటం చూసి అనంతానికి ఇవ్వవలసిన మిగతా డబ్బుని ఇచ్చేసినవెంటనే కాంపుకు వెళ్ళవలసి వచ్చింది. నిజంగానే రాయుడుకి, భార్యకూ ఎడబాటు జరిగిందా? తాను పని అవకుండానే అనంతానికి డబ్బును ముట్టచెప్పాడా అన్న అనుమానాలు ఒదిలి వుండవు. ఆమె రాయుడు తోడులేని నడకపై మోజుపోయి మానేస్తే అతని అనుమానాలన్నీ పటాపంచలయిపోతాయి. ఇంకా బీచికి వెళుతోందా మానేసిందా అన్న విషయం అతను తప్పక భార్యనుంచి పరోక్షంగా కూపీ తీసే ఉంటాడు. ఆమె నడక మానలేదు అన్నవిషయం తెలిస్తే; రాయుడు ఆమె వెంట ఉండుంటాడేమో అన్న అనుమానం ఉండకపోదు. అలాంటప్పుడు ఊరినుంచీ ఈ రాత్రికి వస్తే రేపు పొద్దున్న బీచిలో దాక్కుని భార్యను గమనిస్తాడు. అంచేత అనంతం తన భార్యతో కలిసి నడుస్తూ ఉంటె గుండె ఆగిపోవచ్చు. అలా జరగకుండా ఉండాలని అనంతం మరుసటి రెండు రోజులు రానని సుమతికి చెప్పాడు.

అనంతం ఊహించినట్టే ఒక మూల నక్కి కృపారావు భార్యను బీచిరోడ్డులో ఒంటరిగా వెళ్లడం చూశాడు. అతని మనసు కుదుటపడింది. అనంతం మీద అభిమానం ఏర్పడింది. తన కుటుంబాన్ని నిలబెట్టాడు అతను. దానికి అతను చెల్లించిన మూల్యం స్వల్పం. డబ్బు ఆర్జించుకోవచ్చు; దారితప్పిన భార్యను సన్మార్గంలోకి తెచ్చుకోడం అలవికాని పని. అనంతం కృపారావుకు, అతని భార్యకు కనపడని దూరాన నక్కలా నక్కి కృపారావు చేసినపనిని గమనించాడు.

ఆరోజు నడకనుంచీ ఇంటికి తిరిగివచ్చింది కానీ ఒంటరిగా నడుస్తున్నంతసేపు ఆమె మనసులో పుట్టిన అనంతం గురించిన ఆలోచనలు వేధించాయి. కృపారావు మొహం కడుక్కుని సోఫాలో కూర్చుని ఉన్నాడు అమాయకతను నటిస్తూ. ఆమే రెండు కప్పులతో నురగలు కక్కుతున్న, సువాసన వెదజల్లుతున్న కాఫీని తెల్లటి కప్పుసాసర్లలో తెచ్చి అతనికొకటిచ్చి తాను ఒకటి పెదవుల దగ్గిర ఉంచుకుని తాగుతూ గోముగా భర్తవైపు చూస్తోంది.

"ఈ రోజు శలవు కదా, మా మిత్రుడు అనంతాన్ని భోజనానికి పిలిస్తే ఎలా ఉంటుంది, సుమతీ."

అతని ఆలోచన ఆమెకు ఎంతో నచ్చింది. సంతోషం వ్యక్తం అవకుండా జాగ్రత్త తీసుకుంది; తీసుకోకపోయినా ఇబ్బంది లేకపోయినా. ఆమె ఏమీ సమాధానం చెప్పకుండా, తీక్షణంగా కాఫీ తాగడంలో నిమగ్నమైవుండటం గమనించి ఆమెకు అనంతాన్ని పిలవడం ఇష్టం లేదేమో  అనుకున్నాడు.

"నీకేమన్నా అభ్యంతరకరమా?"

"నాకు అభ్యంతరకరమయితే పిలవడం మానేస్తారా?"

"మానేస్తాను. మేమిద్దరమూ వెళ్లి ఏదన్నా హోటల్లో భోంచేస్తాము. మాతో కలిసి హోటలుకు రావడంలోనూ నీకేమైనా ఇబ్బందైతే అదీ మానెయ్యవచ్చు."

"ఒంటరిగా చేతనయ్యీ అవకా ఏదో ఒండుకు తినే కుర్రాడికి ఒకపూట వండి వడ్డించడానికి నాకేమి అభ్యంతరం, కృపా?"

"నీవు మౌనంగా ఉంటేనూ..."

"అలాగే అనిచెప్పడానికి కాఫీ తాగడం పూర్తయ్యేంతవరకైనా నీవు వ్యవధి ఇవ్వకపోతే ఎలా?"

"అలాగే అనడానికి కాఫీ తాగడం పూర్తవ్వాలా?"

"అతనికి చెప్పండి."

అతన్ని పిలవడానికి వెళ్ళినాపుడు ముందు గునిశాడు అనంతం; ఆ పిదప సుమతి ఆ విషయంలో ఆనందించినంతా ఆనందించాడు. తెల్లచొక్కా నీలం జీన్సులోకి దోపుకుని బెల్టుతో నడుం బిగించుకుని, కొంచంగా చెదిరిన క్రాపుతో, కొత్త మోటారు సైకిలు మీది నుంచీ దిగుతుండటం భార్యాభర్తలు కళ్ళు పెద్దవిచేసి చూశారు. ఎంతో అందంగా వున్నాడు అనంతం. కొత్త బైకు ఎప్పుడు కొన్నాడో!

"రాండీ, అనంతం గారు. మీ బైకు బాగుంది, ఎప్పుడు కొన్నారు?" కృపా అడిగాడు.

"మీలాంటి మిత్రుడు ఇచ్చిన డబ్బుతో నిన్న సాయంత్రం కొని తెచ్చుకున్నా. లేకపోతె ప్రతిచోటికి కాలినడకన వెళ్ళవలసి వస్తోంది."

"లోపలికి రండి," చిరునవ్వుతో ఆహ్వానించింది సుమతి.

వంట ముగిసిన తరువాత ముస్తాబయింది. ఎర్రంచు తెల్ల నేతచీర కట్టి, కొప్పుచుట్టి, దానికి అటూ ఇటూ ఉండేట్టు మల్లెచెండు దోపింది.

"మీరు ఎప్పుడు వడ్డించమంటే అప్పుడు వడ్డిస్తా."

"మీ ఇష్టం – ఎప్పుడు వడ్డించిన ఫర్వాలేదు; ఇప్పుడు వడ్డించిన ఫర్వాలేదు. ఒండుకోడానికి తినడానికి ఫలానా సమయమంటూ లేదు."

ముగ్గురూ టేబుల్ చేరారు. వడ్డించింది. తింటున్నారు. కొసరి కొసరి వడ్డిస్తోంది అనంతానికి. ఎంతో కాలం తరువాత ఇంటి భోజనం ఈ విధంగా తినడం అతనికి నచ్చింది.

"అనంతం గారూ, ఇంతకూ మీ ఆలోచన ఏమిటీ, మీ భవిష్యత్తు గురించీ. ఏదైనా ఉద్యోగాన్వేషణలో ఉన్నారా?" సుమతి అడిగింది.

"నాకు ఉద్యోగాలు చేదు అనుభవాలను మిగిల్చాయి. వ్యాపారం చెయ్యడాని డబ్బూ, అవకాశాలు లేవు. అయోమయంలో ఉన్నా."

"అవకాశాలు నడిచి రావు, వాటికి కాళ్ళులేకపోబట్టి," కృపా అన్నాడు.

"మీ మార్గదర్శకత్వంలో నడుస్తా. అవకాశాలు ఎలా చేజిక్కించుకోవాలో చెప్పండి."

"అవకాశాలు వచ్చినా వాటిని వినియోగించుకునే సామర్థ్యం అవసరం" కృపా అన్నాడు.

"అవకాశాలు రావాలేకాని నా సామర్థ్యం మీద నాకు నమ్మకం ఉంది. ఏదైనా పరిశ్రమ పెట్టుకో వచ్చు చిన్న ఎత్తున. పిండికొద్దీ రొట్టె. నా దగ్గిరున్నది ఒక గదిలో ఉండటానికి, మూడుపూటలా కొంతకాలం తినడానికీ సరిపోతుంది."

"బాంకులు రుణాలు ఇస్తాయి; ప్రభుత్వం చేయూతనిస్తుంది. ఆ దిశలో నడవ వచ్చు. అవి అవకాశాలే! ప్రయత్నించండి," కృపారావు అన్నాడు.

అనంతం మీద అభిమానం పొంగులా పైకి లేచింది ఆమెకు. ఆమె అతిగా పోతున్నానా అన్న విషయాన్ని కూడా ఆలోచించలేదు.

"వెయ్యి గజాల చవిటిపర్ర నాది ఉంది. దాన్ని మీరేదయినా పరిశ్రమ పెట్టుకోదలిస్తే లీజుకి ఇస్తా. వందకో, వెయ్యికో నామమాత్రపు అద్దెతో; మావారు అనుమతిస్తే. అది చూపించి పరిశ్రమల శాఖవారి సలహాతో ఏదన్నా చిన్న తరహా పరిశ్రమ పెట్టుకోవచ్చు," సుమతి అనింది.

"నా అనుమతి ఎందుకు, సుమతీ. నీ డబ్బూ నీ ఆస్తి విషయంలో నీకు ఎప్పుడూ స్వేచ్ఛ ఉంది. నేను వాటిల్లో పొరబాటునకూడా తలదూర్చనని నీకు తెలుసు."

"రేపు పరిశ్రమల వారి కార్యాలయానికి వెళతా; ఏపని చేస్తే వాళ్ళ సహాయం ఉంటుందో కనుక్కుంటా," అనంతం అన్నాడు.

"ఎలావుంది వంటకం?" సుమతి అడిగింది.

"కేవలం బాగుంది అంటే అపచారం చేసినవాడిని అవుతా."

"పోనీ చాలాబావుంది అనెయ్యండి చాలు."

"కాంపునుంచీ వచ్చినపుడల్లా ఎన్నిరోజులు ఇంటికి దూరంగా ఉంటానో అన్నిరోజుల ఆకలితో వస్తాను సుమతి చేతి భోజనం తినడానికి."

భోజనముగించి అరగంట కూర్చుని వెళ్ళిపోయాడు అనంతం. మరుసటిరోజు పరిశ్రమల శాఖకు వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. ప్లాస్టిక్ గొట్టాలు తయారు చేసే యూనిట్ పెట్టుకోడానికి పెట్టుబడి మరీ ఎక్కువగా అక్కరలేదు. పరిశ్రమల శాఖ నుంచి ఆర్ధిక సహాయం దొరుకుతుంది; బాంకులు ఋణాలు అందజేస్తాయి. లైసెన్సు కావాలి. దానికి కొంత కష్టం తప్పదు. ఎవరన్నా రాజకీయ సహాయం ఉంటే పని సులువుగా నెరవేరుతుంది. రాజధానికి పోయి ఉద్యోగులకు లంచం ఇచ్చుకోవాలి. అది లక్షలలో ఉంటుంది. ఇక్కడి వాళ్ళు దరఖాస్తు అక్కడికి పంపుతారు సిఫారసుతో. అలా పంపడానికి చేతులు తడపాలి.

ఆ రోజు సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళాడు అనంతం తెలుసుకున్నది చెప్పడానికి. కృపారావు ఇంకా ఇంటికి రాలేదు. ఆమె అప్పుడే వచ్చి బడలిక తీర్చుకుంటోంది. వివరాలన్నీ ఆమెకు చెప్పాడు.

"సచివాలయంలో మా బంధువున్నారు. ఆయన ఒక అధికారి. ఆయనతో రాత్రి మాట్లాడతాను. ముందు దరఖాస్తిచ్చి వీళ్లకు చెల్లించాలిసిన ముడుపు చెల్లించండి."

ఆ రోజు బంగారయ్యతో మాట్లాడింది. ఆయన ఎంతో ఆనందించాడు చాలారోజుల తరువాత సుమతి మాట్లాడిందని.

"నీకు ఫోను చేసినా నీవు తిరిగి చేయవని మీ పిన్నినిష్టూరాలు ఆడుతుంటుంది. ఈ పని గురించన్నా ఊరు రావచ్చుగదా," అని మందలించాడు.

"శలవు దొరుకుతుందేమో చూస్తాను," అనింది.

బంగారయ్య మరో అధికారితో మాట్లాడాడు. పానకాలు ఒక పిల్ల అధికారి. అతను తన పై అధికారికి లంచాలు అందచేసే మధ్యవర్తి. పానకాలు తప్పక సహాయం చేస్తాను, పంపండి అన్నాడు. శలవు ఇస్తామన్నారు కార్యాలయంలో.

"నేను రాజధాని వెళతానండి – అనంతానికి సహాయం చేసినట్టూ ఉంటుంది, మా బంధువుల కుటుంబాన్ని చూసినట్టుంటుంది."

"ఎలాగూ నాకూ వారంరోజులు కాంపు ఉంది కదా వెళ్ళిరా," అన్నాడు.

బంగారయ్య ఒక విషయం సుస్పష్టంగా చెప్పాడు. తాను చెప్పినంతమాత్రాన లంచం ఇవ్వకుండా పనవ్వదని. చెయ్యాల్సిన సహాయం తెలుసుకున్న తరువాత రెండు లక్షలు ఖర్చవుతాయని చెప్పాడు పానకాలు. బంగారయ్య తన

మిత్రుడు కాబట్టి తానేమీ తీసుకోనని పానకాలన్నాడు. సృష్టిలో స్నేహం తీయనిది అనికూడా అన్నాడట. ఆ తీపి మధుమేహ రోగులకుకూడా ఎలాంటి చేటు చెయ్యదని జోకేసి తానే పగలబడి నవ్వాడు.

లోకంలోనివి వ్యభిచారసంబంధాలు. నిజమైన వ్యాపారం నీచమయినదిగా పరిగణించక్కరలేదు. వ్యభిచారమూ నీచమైనది కాదుగదా అని ప్రశ్నించే రోజులకు చేరివున్నాము. తప్పనిసరై పొట్టకూటికై చేసే వ్యభిచారాన్ని విమర్శించడం కష్టం. సమర్థించుకుంటూపోతే ఏదీ తప్పుగా మిగలదు సమాజంలో. సమాజం గాడి తప్పినప్పుడు క్రమంగా జరిగేది అదే.

కృపారావు వెళ్ళవలసిన రైలుబండి రాత్రి పది గంటలకు. ఆమె, అనంతం వెళ్ళాలిసినది ఎనిమిది గంటలకు. కార్లో ఆమెను స్టేషనులో దింపుతానన్నాడు. నేను కూడా ఆటోలో వెళ్లిపోగలను. రెండుసార్లు స్టేషనుకు రావడం ఎందుకు అని భర్తను నివారింపచూసింది; కానీ అతను వినలేదు. “నిన్ను దింపి నేను వస్తాను. స్టేషను పెద్ద దూరమేమీ కాదుగదా," అని ఆమెను ఒప్పించాడు, ఆమె లోకాంతర ప్రయాణం పెట్టుకున్నట్టు.

కార్లో దారిపొడవునా ఒకరికొకరు జాగ్రత్తలు చెప్పుకున్నారు. చాలాకాలందాకా తిరిగి కలుసుకోడం సాధ్యం కానట్టు స్టీరింగ్ తిప్పుతూ ఒక్కోసారి, ఆమె తనకు దక్కదేమోనన్నట్టు నడుంచుట్టూ కొన్నిసార్లు చెయ్యివేశాడు. అతని భుజాన్ని ఆమె ముద్దుపెట్టుకుంది ఉప్పొంగి నేలపాలయ్యే ప్రేమోద్రేకంలో. నిజమైన ప్రేమ ఒక్కరికే పరిమితం కానీ మరొకరికి పంచిపెట్టేది కాదు అన్నవిషయం ఆమెకు ఎందుకో తట్టింది. విచారంవేసింది. వాళ్ళిద్దరి మనసులలోనూ భావావోద్రేకం కలిగింది.

అనంతానికి సహాయం చెయ్యడంలో భార్య ఎక్కువ దూరం పోతుందేమో అనిపించింది. భార్యమాట ఎప్పుడూ జవదాటడు; భార్య ఏమిచెయ్యడానికి నిర్ణయించుకున్నా అడ్డుపడడు. అనంతం ఆత్మీయుడేమీ కాదు, ఒక పరిచయస్థుడు. ఈ మధ్యే ఆ పరిచయము ఏర్పడింది. అతను కృపారావు దగ్గిర డబ్బు తీసుకోకుండా, నిష్కర్షగా మాట్లాడకుండా తాను చేయగలిగింది కృపారావుకు చేసి ఉంటె అతన్ని తన ఆత్మీయుడిగా భావించి ఉండేవాడు. వాళ్ళిద్దరిమధ్య జరిగిన ఆ వ్యవహారాన్ని వ్యాపారంగా కూడా నిజానికి చూడరాదు. ఒక మాఫియా చేసే పనిలాంటిదది. అతను తనకు తానూ అతనికీ బాకీలేరు. ఆరోజు భోజనానికి పిలవడం ఒక వ్యాపారసంబంధంలో భాగంగా జరిగింది. ఒక విషయంలో కలిగిన కృతజ్ఞతను, కలిగిన సంతోషాన్నీ వ్యక్తం చేసుకోడం కూడా. తనకు అతను చేసింది అభిమానం కారణంగా కాదు. అతనివలన తనకు జరిగిన మంచి మాత్రం డబ్బుమాధ్యమంగా విలువ కట్టలేనిది. భార్యకూ, అనంతానికీ ఎలాంటి సంబంధం ఏర్పడటానికి ఏ కారణం ఉంటుంది? స్త్రీపురుషుల ఆకర్షణ అనేది తప్ప? అలాంటిది ఏర్పడదు అని కృపా భావించడం లేదు. అంతటి అభిమానాన్ని అతనిపట్ల చూపడం కృపకు నచ్చలేదు. కానీ ఆమెతో అలాచెప్పే ధైర్యం అతనికి లేకపోయింది. తాను ఆ విషయంలో ఏదన్నా అంటే ఆమె దాన్ని అవమానంగా భావించవచ్చు. ఏదో ఇబ్బందిలో ఉన్న ఒక వ్యక్తికి నాకు చేతనైన సహాయం చెయ్యాలనిపించి చేస్తున్నా; అది ఏవిధంగా తప్పు అని ఆమె నిలదీయడానికి అవకాశముంది. అలా అంటే తాను సమాధానానికి తడుముకోవలసి వస్తుంది. పైగా ఆమె శీలాన్ని తాను శంకిస్తున్నానని ఆమె భావించవచ్చు; నిజానికి శీలానికి చెరపలేని మచ్చ రాయుడితో ఆమె ఏర్పరచుకున్న సంబంధం వలన ఉంది. తాను

అసూయాపరుడిగా ఆమె దృష్టిలో నిలిచిపోతాడు; ఇన్నేళ్ల సంసారం [రాయుడు ప్రవేశించే వరకు] అత్యంత ఆదర్శవంతంగా నడిచింది. ఏది ఎలా ఉంటె అలా జరగనీ అని తనకు సమాధానం చెప్పుకున్నాడు. అలా భావించడం తప్ప అతను చేయగలిగినది ఏమీ లేదు. ఉంటె అది చెయ్యడానికి ప్రయత్నించవచ్చు. అయినా తాను తప్పుగా వాళ్ళిద్దరి విషయంలో ఆలోచిస్తున్నాడేమో – అలా అయితే బాగుండు. రాయుడి వ్యవహారాన్ని మినహాయిస్తే ఆమెకు నిగ్రహశక్తుంది. ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణా జ్ఞానం ఉంది కూడా.  రాయుడి విషయంలో ఆమెకున్న నిగ్రహ శక్తి, విచక్షణా, జ్ఞానం పనిచేయలేదు. ప్రతిసారి అలా జరగకపోవచ్చు; జరగదని చెప్పడానికీ లేదు; మనిషి తనను తాను జయించలేడు. ఆమె కాలుజారడానికి గల కారణాలు కృపారావుకు తెలియవు; తెలుసుకునే వీలూ లేదు. రాయుడితో సంబంధం ఏర్పరచుకున్న కారణంగా ఆమె మలినపడింది అన్న భావనను అతనిలోని ఉదాత్తత కలుగనీయలేదు. అది ఒక తప్పిదం అంతే. లైంగిక తప్పిదం కనుక ఆమెను ఒదిలెయ్యాలని ఏ మగాడన్నా భావించే అవకాశాలు తక్కువ కాదు. ఒక్కొక్క సంఘటనకు ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కలా స్పందిస్తారు. నైతికత పట్టింపు, ఆలోచనా విధానాలు స్త్రీపురుషుల సంబంధాలలో క్రమంగా మారిపోతున్నాయి.

కారుదిగి ఆమె చేతిని చాపి భర్తతో కరచాలనం చేసింది. గొంతు పూడిపోయింది; కేవలం రెండు మూడు రోజుల ఎడబాటు దానికి ముఖ్య కారణం కాకపోవచ్చు. అతను ఆమెను పూవులా చూసుకుంటాడు; ఒక పరుషపు మాట ఏనాడూ అనలేదు. ఆమె అతనిపట్ల కటువుగా ప్రవర్తించిన సందర్భాలు అనేకం. అతనిలోని అమాయకత తనపట్ల అతను చూపే అతిమంచిదనం ఆమెలో అతనంటే ఏదన్నా చులకన భావానికి స్వల్పంగానైనా తావిచ్చిందా? అని తనను ఆమె ప్రశ్నించుకుంది. సమాధానం తనకు తాను ఇచ్చుకోలేకపోయింది. రాయుడుతో సంబంధం ఏర్పరచుకోకుండా ఉండలేకపోయినపుడు తన పాతివ్రత్యం లైంగికంగా పోయినదానికన్నా కూడా భర్తను మోసం చేస్తున్నానన్న భావం అధికంగా వేధించింది. ఇప్పుడు అనంతం ఆకర్షణకు తాను తట్టుకోలేకుండా ఉందా? తోసిపుచ్చింది ఆ ప్రశ్నను. రాయుడితో చెయ్యి కలిపేవరకూ ఆమె ఒడ్డునే లంగరు వేసిన చుక్కానీ గల పడవ. రాయుడు సుడిగాలిలా చుట్టుముట్టి ఒడ్డునున్న పడవను సముద్రంలోకి తోసేశాడు. తన పని ముంచుకుని పోయాడు. ఆమె ఒడ్డుకు తిరిగి చేరే ప్రయత్నం చేయడం, లంగరు వేసే ప్రయత్నం, చుక్కాని సాయంతో సరైన దిక్కుకు పయనించే వీలూ లేవేమో అనిపిస్తోంది. ఒకసారి మునిగిన తరువాత చలికి భయపడవలసిన అగత్యం ఉండదు.

అనంతం ప్లాటుఫామ్మీదికి సంచీతో అడుగుపెట్టేసరికి నిచ్చెన ఇనుప బల్లమీద ఉంది.

## 9. చెలియలికట్ట

తక్కువకాలంలోనే అనంతం వ్యాపారం నిలదొక్కుకుంది. రెండు చేతులకూ ఎముకలు లేనట్టు డబ్బు సహాయం చేసింది సుమతి. దానితో వాళ్లిద్దరూ బాగా దగ్గరయ్యారు. అనంతం వెలుగిచ్చే దీపం కాదు; వేడిని మాత్రమే ఇచ్చేది. ఆ వేడికి శలభంలా ఆకర్షితురాలయింది సుమతి. ఆకర్షణను భరించలేక చావుకు సిద్దమవుతాయేమో దీపం పురుగులు. అతను దగ్గిరవ్వడానికి కారణం కృతజ్ఞతాభావంతో కాదు. ఆమెనుంచీ అతను ఆశించినది పొందడం. విడిపోకపోవడం ఆమె ఇంకా ఇవ్వగల స్థితిలో వుండటం వలన.

అంతా గమనిస్తూ దిగులుపడటం తప్ప కృపా ఏమీ చెయ్య లేకపోయాడు. అనంతం మీదికిప్రయోగించడానికి అనంతంలాంటి వాడు కృపకు దొరకలేదు; అతను అన్వేషణా చెయ్యలేదు. 'నా బంగారంలో లోపమున్నప్పుడు నేను మరొకడ్ని తప్పుపట్టడమెందుకు?' అన్న నైరాశ్యం అతనిలో ప్రవేశించి కరడుకట్టింది. కానీ తనలో ఉప్పొంగే బాధను అరికట్టలేకపోయాడు. తనను మోసం చేసుకోడానికి ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్ళాడు. బలహీనుడిని అసమర్థత ఎక్కువగా బాధిస్తుందా, బలవంతుడిని ఎక్కువగానా అంటే తేల్చి చెప్పడం కష్ట. బలవంతుడి లోనూ పరిస్థితులు అనుకూలంగా లేకపొతే అసమర్థత వైరస్ లా చోటుచేసుకుంటుంది. అతనిలో వెర్రికళ  వచ్చింది. అనంతంలో మార్పు తెచ్చిన లోకాతీత శక్తి లాంటిది మాత్రమే అతనిలో మార్పుతేగలదు.

నమ్మలేనిది వర్తమానమా, గతామా  అన్న సంశయం అనంతానికి అప్పుడప్పుడూ వస్తుంటుంది. నవ్వుతెప్పిస్తుంటుంది. ఎదగాలనుకోవడం, ఇంకా పైకి ఎదగాలనుకోవడం ఒక వ్యసనంగా మారింది అతనికి. మానవత్వంలోగాని, సంస్కారంలోగాని అతనికి ఎదగాలన్న ఇఛ్ఛ లేదు. అది సాధ్యం కూడా కాకపోవచ్చు అతనికి. ఆ రాత్రి అద్వీతీయమైన శక్తి అతనిలో ప్రవేశించి గుణాంతరం చెందాడు.

సుమతి  ఆఫీస్ నుంచీ రాగానే అప్పటికే ఒచ్చున్న  కృపాను చూసి ఆశ్చర్యపోయింది. అతను నిద్రలో  లేకపోతె ఆమె గదిలోకి తలుపులు చప్పుడు చేసి రావడం వినిపించి పక్కకన్నా తిరిగి మొహం మీది గుడ్డను తొలగించి చూస్తాడేమో అనుకుంది. ఒంట్లో బాగాలేదేమో. పడకగది తలుపులు కూడా బిగించి, దుప్పటి కప్పుకుని మంచం మీద బోర్లా పడుకుని ఉన్నాడు. పంకా దానికి సాధ్యమైనంత వేగంగానూ తిరుగుతోంది. అది ఊడిపడదుగదా అని ఆమెకనిపించింది. ఊడిపడ్డా లెక్కలేనట్టు అతను పడుకున్నట్టుంది. యమ భటుడొచ్చినా నాకేమి అన్నట్టు పడుకునే ఉన్నాడు. గాఢ నిద్రలో ఉన్నాడా? పగలు అతను పొరబాటునకూడా నిద్రించడు. చీర విడిచి స్నానాల గదిలో దూరి స్నానం ముగించి తిరిగి వచ్చి వేరే బట్టలలోకి మారినా, పౌడర్ పూసుకుని తల సవరించుకుని కూనిరాగం తీస్తున్నా అతనిలో చలనం లేదు. అతని పక్కన కూర్చుని గోముగా, అతని కురచపేరుకు డియర్ కూడా చేర్చి పిలిచినా అతను నిద్రో కాదో తెలియని స్థితిలో అచేతనంగా ఉన్నాడు. ఉద్యోగ సంబంధమైన చిక్కులో ఇరుక్కున్నాడేమో. అలా అయితే ఆ పాడు ఉద్యోగం మానెయ్ అని

ఓదార్చుదామనుకుంది. ముక్కు దగ్గిరికి వేలు చేర్చి చూసింది ఊపిరి పీలుస్తున్నాడు, కాకపోతే కాస్త భారంగా. దుప్పట్లోకి చేతిని దూర్చి గొంతును, ఛాతీని నిమిరింది. అలా చేస్తే, మామూలుగా ఐతే పరవశించిపోతాడు, బాయి కావాలని అడిగే పిల్లవాడవుతాడు.

"అసురసంధ్యవేళ నిదరేమిటి, కృపా?"

"పగలూ రేయీ తేడా ఎరుగక ఇంతవరకూ కుంభకర్ణుడి నిద్రలోనేవున్నా. ఇప్పుడే మేలుకున్నా సుమతీ డియర్."

"జోకు బావుంది. ఏమిటలావున్నావు?"

"మరోలా ఉండటం చేతకాక."

గిలిగింతలు పెట్టింది. దుప్పటి విసిరివేసి నడిమంచంలో కూర్చున్నాడు.

"అలిగావా?"

"దేనికి?"

"నువ్వే చెప్పాలి ఆ విషయమూ."

"నా కన్నుకప్పిన విషయం నీకు తెలియనిదా?"

అతను లేచి స్నానాల గదిలోకి దూరాడు మొహం కడుక్కోడానికి. ఆమెకు కాళ్ళు వణకడం మొదలయింది. ఉన్న సత్తువ శరీరాన్నిఒదిలెయ్యడం మొదలుపెట్టింది. అతని గురించికాకపోయినా తన గురించీ తేనీరు పెట్టుకోవాలని, మొహం చాటుచెయ్యటానికి ఒక తాత్కాలిక ఒంక దొరుకుతుందని వంటగదిలోకి దూరింది. అతను ఒట్టినీళ్ళతోటే మొహం పదేపదే కడుక్కుని, రంగస్థలం మీదికి వెళ్ళడానికి సిద్ధమైనట్టు సిద్ధమై ఇంటిముందరి గదిలో సోఫాలో కూర్చున్నాడు. చేత్తోటి కప్పులు తేలేక ట్రే మీద ఉంచుకుని తెచ్చి టీపాయ్ మీద ఉంచి, రెప్పలు  దించి సోఫా వెనక్కు వాలింది.

"వింత విషయం; టీ తాగాలని లేదు కానీ దాని అవసరముంది," అన్నాడు.

"ఎందుకలా అనిపిస్తోంది?"

"పాత అనుభవమే కొత్తగా అయి."

"నాకు వినాలనుంది వివరంగా."

"నాకూ చెప్పక తప్పదు; నా జీవన్మరణ సమస్య. చెబితే నువ్వు ఏడుస్తావు."

"నీవు చెప్పకపోయినా ఏడుపొచ్చేట్టుంది."

"నీకు బాగా తెలిసిన విషయం నేను చెప్పడం అవసరమా?

“నేను సంజాయిషీ ఇచ్చుకోడానికి వీలుగా చెప్పొచ్చుగా? నీవు నిజాన్ని స్వీకరించి ఎప్పటిలా ఉండగలవా?"

"అంటే? ఏమీ తెలియనివాడిలానా లేక తెలిసినా గతంలోలా తెలియనట్లా?"

అనుకోని మలుపులు జీవితంలో తిరగపోతున్న వేళ ఆసన్నమయింది అనిపించిందామెకు. ఆ విషయం ఎప్పటికైనా కృపకు తెలియక మానదు అని ఆమెకు ముందే తెలుసు. తెలిస్తే ఏమి చెయ్యాలి? ఆ ప్రశ్నకు మాత్రం ఆమెకు సమాధానం దొరకలేదు. ఏది జరిగినా అది అతని నిర్ణయం మీద ఆధారపడుంటుందన్నది ఆమెకు తెలుసు. జరిగేదానికై ఎదురుచూడటం, జరిగేదాన్ని జరగనీయడం (జరగనీయడం అన్న పదం సరైనది కాకపోవచ్చు) తప్ప మరేమార్గమూ లేదు. అతనికి అనంతం తన మధ్య జరుగుతున్న విషయం త్వరగా తెలిసిపోవడమే మేలు అనీ అనుకునేది. ఏ విషయము నలుగుతుండటం పర్యవసానం గురించీ ఎదురుచూస్తుండటం కూడా ఒకరకమైన వ్యధ. కృపా మీద ఎనలేని ప్రేమా, జాలీ చొచ్చుకొచ్చాయి. అతని పక్కకెళ్లి కూర్చుని అతని ఒళ్ళో తల వాల్చి ఏడ్చింది. అతను తన తలను ఆమె తల మీద వాల్చి వెంటనే తీసేశాడు. ఎవరైతే తన వ్యథకు కారణభూతమో ఆ వ్యక్తినుంచి ఊరట పొందబోవటం హాస్యాస్పదం.

ఆమెను తన ఒడిలోనుంచీ లేపేశాడు. ఆమె అతని పక్కనుంచీ వెళ్లి ఎదురు కుర్చీలో కాలి మీద కాలు వేసుకుని కూర్చుంది. అతను చూసే చూపు ఆమెలో కాస్త చికాకు కలిగించి అది ధైర్యానికి దారి తీసింది.

"ఏమిటా చూపు, నేరస్థురాలిని చూస్తున్నట్టు?"

"ఏమిటా ప్రశ్న, రక్షకభటుడిని నేరస్థుడు అడిగినట్టు?"

అతనిలో అంతటి కాఠిన్యమూ ఉందని ఆమెకు మొదటి సారి తెలిసింది. రెచ్చిపోవడం వలన ఉపయోగం లేదని; అలా రెచ్చిపోవడం అతనికి తానుచేసిన మోసానికి వడ్డీలాంటిదవుతుందని మౌనంగా ఊరుకుంది.

"ఎన్నాళ్ళనుంచీ మీ బాగోతం జరుగుతోంది? తక్కువకాలనుంచైనా, ఎక్కువకాలం నుంచైనా నాకు అనవసరం కూడా."

ఆ మాటలు తోక తొక్కిన పాము బుసల్లా వినిపించాయి ఆమెకు. అతనికి తనను చాలినంత తిట్టాను అన్న సంతృప్తినన్నా కలిగించడానికి అవి ఉపయోగిస్తాయి అనుకుని మౌనాన్ని కొనసాగించింది.

"నాలో ఏదన్నా లోపముందా? అనంతం అంత అందగాడిని కాను అంతే. ఒకడికన్నా ఇంకొకడు ఎక్కువ అందంగా కనిపిస్తే స్త్రీ వాళ్ళ వెంట పడుతుండాలా? పడుతుంటుందా?"

"పడదు. నేనూ అలా పడలేదు. అనంతం తారసపడక ముందు అతనికన్నా అందగాళ్ళను నేను చూడలేదా, వాళ్ళ వెంట పడ్డానా?"

"అలా అయితే నీవు చేసినపకి గల కారణాన్ని తెలియజేయగలవా?"

"చెప్పలేను, కృపా. నిజంగా చెప్పలేను. ఇదమిత్థమని నాకే తెలియదు. అదొక ఇంద్రజాలంలాంటిది."

"కారణమూ నిజానికి నాకక్కరలేదు. ఒక ఒప్పందానికి భంగం కలిగిందా లేదా, ఒక అనైతిక విషయం మన సంబంధంలోకి ప్రవేశించిందా లేదా అన్నవి ముఖ్యమైనవి. నా జ్ఞానేంద్రియాలు గ్రహించిన సత్యానికి వేరే సాక్ష్యులు

అక్కరలేదు. ఇంద్రియాలు నన్ను మోసంచేయడం లేదని, చేయవని నా నమ్మిక. అవి 'నా' మనసుకు, శరీరానికి సంబంధించినవి."

ఆమె అతన్ని చూస్తోంది రెప్పవేయకుండా, దేవతలా. అతను ఆస్మా రోగిలా ఊపిరి పీలుస్తున్నాడు. నీవనుకున్నదంతా తప్పు, తప్పు, తప్పు అని హిస్టీరియా రోగిలా అరవాలనుంది. ఆ అబద్ధం చెప్పగల, బుకాయించగల సామర్థ్యం ఆమెలో లేవు. అలా చెప్పినా ఆతను నమ్ముతాడన్న నమ్మకం లేకపోయినా. అలా ఆమె చెప్పుంటే తాత్కాలికంగానన్నా అది ఉపశమనాన్ని కలిగించి ఉండేది అతనికి. చేసిన, చేస్తున్న మోసానికి తోడు అలాంటి అబద్ధం ఒక వేళ ఆడ కలిగినా తనంటే తనకే ఉన్న ఏవగింపు అధికమయ్యుండేది సుమతికి.

నువ్వు నన్ను మోసం చేయడం ఆరంభించిన తరువాత, నాకు అనుమానం కలగడం ఆరంభించిన తరువాత వాస్తవాన్ని అంగీకరించి బాధపడలేక కొంతకాలం నన్ను నేను మోసంచేసుకున్నా. అంటే రెండు మోసాలు – ఒకటి నీది, రెండోది నాది; రెండింటి బాధితుడిని నేనే. నన్ను బాధించే మరో అంశమూ ఉంది. నన్ను నీవు చేసే మోసం సంగతి నాకు నిర్ధారణగా తెలిసిన తరువాత నన్ను నేను చంపుకోలేని అసమర్థతవల్ల జీవనాన్ని కొనసాగిస్తూ రావడం. ఇప్పుడు విచారణ చేపట్టాను. నీవు నాకు ఒక్క ఉపకారం చేస్తానని వాగ్దానం చెయ్యి; ఆ పని నీవు నిర్వర్తించిన పిదప జీవించడం జరగదు."

"మిమ్మల్ని మీరు తమాయించుకోండి. మీరు నా చేతుల్లో మరణించడంకన్నా మీరే నన్ను తుదముట్టిస్తే మీ సమస్య, నాదీ కూడా పరిష్కారమవుతాయి. కావలిస్తే నేను ఆత్మహత్యచేసుకుంటున్నానని ఒక ఉత్తరం రాసి మీ చేతికిస్తాను."

"మన మాటలు చివరకు సినిమా సంభాషణల స్థాయికి దిగాయి. నా మీదే కాక నీ మీదా జాలికలుగుతోంది నిన్ను అంతగా ప్రేమించడమనే నా బలహీనతవల్ల. మనిషికి జరిగే అన్యాయాన్నీ, మోసాన్నీ దిగమింగుకుని, తమాయించుకుని వాడు ముందుకు సాగ గలిగిన మనసు ఇవ్వబడుంటే బాగుండును. నిజానికి మరొకరికన్నా నాకు అలాంటి మనసు ఎక్కువగా ఉందనుకుంటా, అపరిమితంగా కాకపోయినా. మరొకరిలా మనం ఉండలేము. మనలా మాత్రమే మనం ఉండగలం. తనదనుకున్న స్త్రీని మరో పురుషుడితో పంచుకోగల, తన వాడనుకున్న పురుషుడిని మరో స్త్రీతో పంచుకోగల వితరణశీలత, దాతృత్వం ఉన్న స్త్రీ పురుషులు ధన్యులు."

"అలాంటి వారు లేరా?"

"అలాంటి అదృష్టవంతులలో నేనూ ఒకడిని కానందుకు విచారిస్తున్న! సంఘంలో ఉన్నంతవరకూ దానికి భయపడి చావక తప్పదు. దాని దృష్టి భేదాన్ని ఖాతరుచెయ్యకుండా జీవించడం అందరికీ సాధ్యం కాదు. సంఘంలో ఒకరుగా ఎందుకు మనం జీవించాలి? ఒంటరిగా జీవించి చావలేక. జీవిస్తున్నపుడు దాని అభిప్రాయాలను ఖాతరుచేయననడం సాధ్యమా? న్యాయమా? నేనొక కకోల్డ్ ను. ఎంత బాధించేపదం అది! ఎలాంటి అవమానాలున్నా వాటికి ఎదురు ఈదగల శక్తిని నీమీద నాకు గల, నిర్మూలించలేని ప్రేమ ఇస్తుందో లేదో కూడా నాకు ఈక్షణాన తెలియదు.

తమాయించుకోమని ఇంతకుముందు ఒకసారి అన్నావు. పిట్టగిల్లి జోలపాడక. నీ కల్లబొల్లి కబుర్లు మన కాపురాన్ని నిలబెట్టగలవా?"

“మీరు తమాయించుకోకపోతే మీకు నష్టం లేక హాని జరుగుతుందని నా భయం."

"నీవు నీ ప్రియుడితో తిరగడం వలన నాకు జరిగినది లాభమా, నష్టమా లేక హానా, సుమతీ?"

"నష్టమే లేక హానే. మరికొంత నష్టం లేక హాని మీకు వాటిల్లకూడదని నా ఆందోళన. మీకు నష్టం జరగాలని కోరుకుని నేను ఆ పని చెయ్యలేదు. మీరు నాకు శత్రువు కాదు."

"నీవు నాకు నా శత్రువుగా హాని చేశావా మిత్రుడిగా చేశావా అన్నది అనవసరమైన విషయం. జరిగింది నన్ను కుదేలుచేసేపనా కాదా అన్నది."

ఆమె తలదించుకుని కన్నీరుపెట్టుకుంది. ఆమె వైపునుంచీ మొహం తిప్పేశాడు; కన్నీటితో లొంగదీసుకుంటుందేమో అన్న ఆలోచనొచ్చి.

"నిజమే, కృపా."

"ఆ పని చెయ్యకుండా ఉండలేక చేశా అన్న అర్థం వ్యక్తమయింది. ఇంద్రజాలానికి లోనయ్యావు. వాడు మాయల మన్మథుడు; మాయల ఫకీర్, మాటల మాంత్రికుడు, మోసగాడు, నీ అందంకన్నా ఆ కుక్కకు కావలసినది నీ డబ్బు; నీ మనసూ కాదు, నీ రెండు తొడల మధ్యనుండే ఎముకా కాదు. ఇప్పటికన్నా గ్రహించానని ఒప్పుకునే శక్తి నీలో ఉందా?"

"నాకు అతనిని గురించిన విషయాలు తెలియవు. ఇప్పటికీ తెలియవు. తెలుసుకోవాలన్న ఆసక్తీ లేదు," తల ఎత్తి, పవిటకొంగుతో కళ్ళు తుడుచుకుని ధైర్యంగా అనింది.

"నీకు ఇప్పటికీ తెలియవు; ఒక అనామకుడితో అనామక సంబంధం. వాడి గురించీ నేను చెబితే నమ్మాలని లేదు; అంతేనా?"

"కావచ్చు; కాకపోనూ వచ్చు, కృపా. నేను ఎంత బేలనో మాత్రం ఇపుడు తెలుసుకున్నాను."

"బేలకూడా భయంకరమైన కార్యానికి ఒడిగట్టగలదు అన్న విషయం నిన్ను చూసి తెలుసుకోవాలి. నీవు కొన్ని విషయాలలో నాకు గురువువు కూడా. నీ దగ్గిరనుంచీ ఏమి నేర్చుకోవాలన్నా నాకు నామోషీ లేదు. ఇప్పటిది నా జీవితాన్ని సరిదిద్దలేని పాఠం."

"మన సంసార జీవితంలో ఒకరి నుంచి మరొకరం ఎన్నో నేర్చుకున్నాము అహం అడ్డురాకుండా. ఇద్దరు చిన్నపిల్లలలా, స్నేహితులలా, ప్రియులలా, ఆత్మీయులలా, కవలలులా జీవించాము. ఆ జీవితం కొనసాగాలనే ఉంది."

"ఆ పని చేయడానికి పూనుకున్నపుడు, చేస్తున్నపుడు అది నాకు తెలిసినా సంసారం కూలిపోకుండా కొనసాగుతుందని భావించావా?"

"లేదు."

"గతజలసేతు బంధనం. ఆ తేనెపూసిన కత్తిని, గోముఖవ్యాఘ్రన్ని, పయోముఖ విషకుంభాన్ని, నా మెడకు నేను వేసుకోబోయే ఉచ్చుగా పరిణమించవచ్చని తెలిసినా, నా వంతుగా నేను దగ్గిరికి తీశాను. నీవు వాడి అందం, మాటలు సృష్టించిన మాయకు నిన్ను నీవు అర్పించుకున్నావు వజ్రాలుపొదిగిన బంగారపు పళ్లెంలో."

ఆమె క్రమేపీ ధైర్యంపుంజుకుంటోంది. బహుశా రాయుడితో కలిసినప్పటిలాగే అనంతంతో కలిసినా కృపా గ్రహించలేకపో వచ్చని, పట్టించుకోకపోవచ్చని అంతరాంతరాలలో ఉండిఉండవచ్చు. కళ్ళుమూసుకుని ఎవరూ తోలనిపిల్లిలా పాలు తాగింది.

"వాడు నాకన్నా అధిక లైంగిక సుఖం ఇవ్వగలిగాడా?"

అనవసరంగా లెంపకాయ ఇచ్చినట్లయింది ఆమెకు. తమాయించుకుంది. కృపా చెలరేగి, చెలరేగి శాంతిస్తాడన్న ఆశవుంది. జీవితంలో ఎన్నడూ పట్టనంత ఓపిక పట్టె ప్రయత్నం చేస్తాను, చేస్తాను, చేస్తాను అనుకుంది. పట్టగలదా? విడాకులిస్తానంటాడు; తననో, అనంతాన్నో కత్తితో పొడిచి చంపడు; చంపలేడు. అనంతాన్ని కలుస్తాడేమో. వాళ్ళిద్దరి మధ్య గొడవ తప్పేట్టులేదు. కృపా తనకు ఎప్పటికీ కావాలి. ఆఖరి సమ్మెటపోటుకై ఎదురుచూస్తోంది.

"నీవు చాలా అసభ్యంగా మాట్లాడుతున్నావేమో అనిపిస్తోంది; నన్నుఅవమానించేట్లుగా కూడా ఆ మాటలున్నాయని నీకు తోచకపోవడం శోచనీయం."

"దానికి కారణం నీవుకాక మరెవరోనా? నా మనసులో ఒక సుడిగుండాన్ని సృష్టించావు. ఒక వేళ నేను చచ్చినా నీదే దాని బాధ్యత."

"భార్యాభర్తల సంబంధం కేవలం లైంగిక నైతికత దృష్టితో చూడటం కొంతయినా అన్యాయం కాదంటావా?"

"ఇల్లు తగలబడి పోతుంటే విశ్లేషణకు దిగడం వివేకవంతమా, అవివేకవంతమా? భార్యాభర్త సంబంధాలు క్లిష్టమైనవి. వాటిని చెడగొట్టుకున్న ప్రతి వ్యక్తీ ఆదర్శాలను వల్లెవేస్తూ వైవాహిక వ్యవస్థనే తప్పుపడతారు. వ్యభిచారాన్ని సమర్థించుకుంటారు నేను కేవలం రెండో పురుషుడు లేక స్త్రీతోనే కదా లైంగిక సంబంధాన్ని కలిగి వున్నాను (దానికి అందమైన పేరు పెట్టుకుని); కావున అది వ్యభిచారంక్రింద రాదు అని వాదించడమేగాక వ్యభిచారాన్ని నిర్వచించవచ్చు. అదంతా కొత్త కథ కాదు."

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS